# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 25, డిసెంబర్ 2025




## మిన్నంటిన ముందస్తు క్రిస్మస్ సంబరాలు



**నస్పూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

స్థానిక రెయిన్‌బో పాఠశాలలో బుధవారం క్రిస్మస్ ముందస్తు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ రజనీ, కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల లోని సేక్రెడ్ హార్ట్ ఫోరెన్ చర్చి రెవరెండ్ జోస్ మణికథన్ విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. పండుగ వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన అద్భుత ప్రదర్శనలకు గాను ముఖ్య అతిథుల మిగతా 2లో..

## జంగుబాయి మహాపూజకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

### మేడారంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ఆసిఫాబాద్, ప్రభాతవార్త:**

ములుగు జిల్లా మేడారంలో మంత్రి సీతక్కను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మర్యాదపూర్వకంగా కలిసి, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోట పరందోలి గ్రామంలోని జంగుబాయి దేవస్థానంలో ఈ నెల 30న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న మహాపూజ, ధర్బార్ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మిగతా 2లో..



## నియర్ బై అథ్లెటిక్స్ టోర్నమెంట్ ప్రారంభం

**మందమర్రి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో మందమర్రి ఏరియా డబ్ల్యూ.పి.ఎస్ అండ్ జి.ఏ వారి ఆధ్వర్యంలో నియర్ బై అథ్లెటిక్స్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, ఏఐటీయూసీ మిగతా 2లో..

## విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

**☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

ప్రభుత్వ విద్యా సంస్థలలో అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ మిగతా 2లో..





### శ్రీరాంపూర్ టింబర్ యార్డ్

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మహిళా కార్మికులతో బరువు పనులు చేయించడం అన్యాయం
- ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు

**నస్పూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

ఐఎన్టీయూసీ బాయి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ స్టోర్స్, టింబర్ యార్డ్ కార్మికులను యూనియన్ నాయకులు కలిసి వారి మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ స్టోర్స్ టింబర్ యార్డులో కాంట్రాక్టు గడువు ముగిసిందనే నెపంతో 24 మంది కార్మికులను విధులకు దూరం చేయడం సరికాదన్నారు. కాంట్రాక్టు కార్మికులు లేకపోవడంతో, లారీల్లో వచ్చే భారీ యంత్రాలు, సామాగ్రిని జనరల్ అసిస్టెంట్ మహిళా కార్మికులతో అన్ లోడింగ్ చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలతో ఇటువంటి బరువు పనులు చేయించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తక్షణమే సదరు 24 మంది కాంట్రాక్టు కార్మికులను మరో రెండు సంవత్సరాల పాటు విధుల్లో కొనసాగించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. టింబర్ యార్డ్ లో పనిచేస్తున్న పీస్ రేటెడ్ కార్మికులకు పని తక్కువగా ఉండటం వల్ల వేతనాలు సరిగా అందడం లేదని కార్మికులు తమ గోడును నాయకులకు వివరించారు. శ్రీరాంపూర్ స్టోర్స్ లో ఉన్న ప్రత్యేక ఫిట్మెంట్ విధానం వల్ల కార్మికులకు నష్టం జరుగుతోందని, మిగతా 2లో..

## మిన్నంటిన ముందస్తు క్రిస్మస్ సంబరాలు

(మొదటిపేజీ తరువాయి)

చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ముఖ్య అతిథి రెవరెండ్ జోస్ మణికథన్ మాట్లాడుతూ.. యేసుక్రీస్తు జననం వెనుక ఉన్న పరమార్థాన్ని, పండుగ విశిష్టతను వివరించారు. కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ మాట్లాడుతూ.. క్రిస్మస్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది సమాజానికి దయాహృదయం, దానగుణం మరియు నిస్వార్థ ప్రేమ అనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ రజనీ మాట్లాడుతూ.. రెయిన్‌బో పాఠశాల ఎల్లప్పుడూ సర్వమత సమానత్వాన్ని బోధిస్తుందని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది మన భారతదేశ గొప్పతనమని, అటువంటి విలువలను విద్యార్థులకు చిన్నతనం నుండే నేర్పించడం తమ బాధ్యత అని ఆమె సందేశాన్ని ఇచ్చారు.

## జంగుబాయి మహాపూజకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

సలాం శ్యామ్ రావు, ఉత్సవ కమిటీ పెద్దలతో కలిసి జంగుబాయి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. జంగుబాయి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహాపూజ, ధర్బార్ కార్యక్రమాలు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని సుగుణక్క తెలిపారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క వెల్లడించారు.

## నియర్ బై అథ్లెటిక్స్ టోర్నమెంట్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ హాజరై తమ సందేశాలతో టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి పేరును కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్‌లో నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి క్రీడాకారుడిపై ఉందని అన్నారు. ప్రతి క్రీడాకారుడిలో శ్రమ, పట్టుదల ఉంటాయని, వాటిని మరింత మెరుగుపరచుకుంటే విజయం తప్పక వరిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం జెండా ఊపి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి డబ్ల్యూ.పి.ఎస్ అండ్ జి.ఏ హానరబుల్ సెక్రటరీ కార్తీక్, స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ టింబర్ యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

త్వరగా వారికి బేసిక్ పే ఫిక్సేషన్ పూర్తి చేసి న్యాయం చేయాలని కోరారు. చాలా మంది కార్మికులు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నందున, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. త్వరలోనే ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనప్రసాద్ శ్రీరాంపూర్ స్టోర్స్ లో పర్యటించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు కలవేని శ్యామ్, గారిగే స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, తిరుపతి రాజు, లాగల శ్రీనివాస్, విష్ణు ప్రసాద్, ఫిట్ కార్యదర్శి భూక్య రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా

**సారంగాపూర్, డిసెంబర్24, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లక్కడి శంకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీలను నెరవేర్చలేదని, రైతులకు రుణమాఫీ అని చెప్పి ఎన్నో సాకులు చెప్పి కొందరికి మాఫీ చేసిందని, రైతు భరోసా పెంచుతామని చెప్పి రెండు విడుదలగా రైతు భరోసా ఎగవేసి రైతులకు మొండి చేయి చూపిందని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 1200 రూపాయలను ఇస్తానని చెప్పి ఇప్పటికి అమలు చేయలేదని, వృద్ధులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు రూ 4000 పెన్షన్ పెంచుతానని చెప్పి రెండు సంవత్సరాలుగా దాటిన నయా పైస పెంచలేదని అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం కింద ఆడపడుచులకు తులం బంగారం ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని బహిరంగంగా ప్రకటించిన అది ప్రకటనకు మాత్రమే ఉందని, ఏ ఒక్క హామీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చకపోవడం ద్వారా, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో ఇది సరైంది కాదు అని కాంగ్రెస్ పార్టీకి తన మార్కెట్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్ అధికారికి అందించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు చేసిన అల్లికలు, కళాకృతులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా, మత్తు పదార్థాల కట్టడికి పోలీసుల నాకాబందీ

**- నేరాల నియంత్రణే లక్ష్యం: నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు**

**- మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్**

**మంచిర్యాల, డిసెంబరు 24, ప్రభాతవార్త**



రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు (నాకాబందీ) నిర్వహించారు. మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో సీసీసీ నస్పూర్ పరిధిలోని తోళ్లవాగు వద్ద జాతీయ రహదారిపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నివారించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై, హెల్మెట్ లేని వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీసీసీ నస్పూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ యు. ఉపేందర్ రావు, ఎస్సై జితేందర్ సింగ్, ఏఎస్సై శకుంతల, హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుళ్లు సతీష్, చంద్రమోళి, అశోక్, మల్లేష్, వనిత, వాణిశ్రీ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు

**మందమర్రి డిసెంబర్ 24, ప్రభాతవార్త**

అంతర్జాతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రీన్ వుడ్ (సీబీఎస్ఈ) పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ చంద్రమోహన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. విద్యార్థులు గణితంపై ఎక్కువ మక్కువను పెంచుకోవాలన్నారు. గణితంలోని సమస్యలను సులువుగా సాధించేందుకు అనేక పద్ధతులను శ్రీనివాస రామానుజన్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గణితంలో ప్రతి సమస్యకు పరిష్కారముం టుందని, విద్యార్థులు గణిత శాస్త్రమును ఇష్టంగా స్వీకరించాలని కోరారు. మనిషి జీవితంలో ఆక్సిజన్ ఎంత ముఖ్యమో గణితం అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలోని గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ గణిత మోడల్స్, గణిత భావనల ప్రదర్శన, విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వైఎస్ ప్రిన్సిపాల్ జి తిరుపతి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గణిత శాస్త్ర వేడుకలను ఘనంగా నిర్వహించిన పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ డా. భరద్వాజ నాయుడు ఏజీఎం పవన్ కుమార్ లు ప్రత్యేకంగా అభినందించారు.



### ఏఐటీయుసీ వైఫల్యంతోనే

## సింగరేణి వేడుకల తగ్గింపు

**- టీబీజీకేఎస్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి**

**బెల్లంపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



ఎంతో ఘన చరిత్ర కలిగిన సింగరేణిలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తగ్గించి నిర్వహించడానికి సింగరేణిలో గుర్తింపు సంఘం అయినటువంటి ఏఐటీయూసీ వైఫల్యమేనని టీబీజీకేఎస్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. మంగళవారం రోజున బెల్లంపల్లి పట్టణంలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకే తలమానికమైన సింగరేణిలో సింగరేణి వేడుకలను తగ్గించి నిర్వహించడం సింగరేణి కార్మికులను అవమానించడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా సింగరేణి యాజమాన్యం నడుచుకుంటూ కోట్ల రూపాయలు వివిధ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఖర్చు పెడుతున్నా ఉలుకు పలుకు లేని గుర్తింపు సంఘం, సింగరేణి వేడుకలకు కూడా డబ్బులు తగ్గించి ఇవ్వడాన్ని ఆపలేకపోయిందని అన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పూర్తిగా అన్ని విషయాలలో వైఫల్యం చెందిందని ఈ మధ్యకాలంలో వచ్చిన సర్క్యులర్లను ఆపలేకపోయిందని కార్మికులకు అన్యాయం జరుగుతున్న ఏమాత్రం స్పందించడం లేదని, సింగరేణి వేడుకలను తగ్గించడానికి ఆపే శక్తి లేక గనుల మీద అడ్డుకున్నట్టు షో చేయడాన్ని ఎద్దేవా చేశారు. ఈ మధ్యకాలంలో రిటైర్ అయిన కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లింపులు కూడా క్వార్టర్ ఖాళీ చేయాలని నిబంధన పెట్టడాన్ని ఖండించారు. కొడుకుకు ఉద్యోగము ఇచ్చిన తర్వాత అతని పేరు మీద క్వార్టర్ చేయించుకునే అవకాశం ఉన్నదని ఒక పక్క ఉద్యోగాలు ఇవ్వకుండానే క్వార్టర్ ఖాళీ చేయలేదనే పేరు మీద రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ ఆపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది కూడా ఏఐటీయూసీ వైఫల్యమే అని ఇప్పటికైనా ఇప్పటికైనా అట్టి సర్క్యులర్ ను సరి చేయించి రిటైర్డ్ కార్మికులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్ కుమార్, బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఓ.రాజశేఖర్, సెంట్రల్ కమిటీ నాయకులు రాజనాల రమేష్, అశోక్, గోలేటి సిహెచ్పి ఫిట్ కార్యదర్శి మెరుగు రమేష్, బెల్లంపల్లి టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయ ఇన్చార్జి మైదమ్ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రవెల్లి నుంచి బెల్లంపల్లి వెళ్లే రహదారి క్లీన్

**వాహనదారుల ఇబ్బందులు తొలగించిన నూతన పాలకవర్గం**

**బెల్లంపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**




బెల్లంపల్లి మండలంలో గత ఎన్నో రోజులుగా చంద్రవెల్లి నుంచి బెల్లంపల్లికి వెళ్లే రహదారి ఇరువైపులా పిచ్చి మొక్కలు, వేపుగా పెరిగిన చెట్లతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కవడంతో, నూతనంగా చంద్రవెల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన వెంటనే బుధవారం రోజున సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజేల్లి రాజకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆ రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను క్లీనింగ్ చేయడం, వేపుగా పెరిగిన మొక్కలను నరికించడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోయాయి. నూతనంగా గెలుపొందిన పాలకవర్గం ఇలాంటి పనులు వెంటనే చేపట్టడంపై ప్రజలు, వాహనదారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

## పోచమ్మ తల్లి పునః ప్రతిష్ఠాపన

**పెంచికల్‌పేట్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

మండలంలోని గుంట్లపేట్ గ్రామంలో ఊరు పోచమ్మ తల్లి పునః ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉద్భావన, గ్రామ అష్టదిగ్బంధనం, రుద్రహోమం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేవర వినోద్, అశోక్ చారి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ

**తాండూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**



మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు తాండూర్ పశువైద్యశాల డాక్టర్ నరసింహారావు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు యజమానులు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించుకోవాలని సూచించారు. కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్. కుర్మ సంఘము నాయకులు. అన్నం మల్లేష్, నరిగే ఐలయ్య, ముదిగిరి రాజయ్య, ఎగ్గె బీరయ్య, కోరే రాజేష్, అన్నం రాజేష్, పశువైద్య సిబ్బంది దుర్గం కళ్యాణ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఆర్ సెర్ సిట్ దక్కించుకున్న పూర్వ విద్యార్థికి సన్మానం

**నార్నూర్, ప్రభాతవార్త:**




మండలంలోని తాడి హత్నూర్ గ్రామానికి పెద కుటుంబానికి చెందిన రాథోడ్ అలేఖ్య ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ సిట్ ఇస్రోలో సాధించింది. ఒకటో తరగతి నుండి ఏడవ తరగతి వరకు శ్రీ సేవాదాద్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభ్యసించింది. ఇస్రో లో ఐఐ సెర్ సిట్ సాధించడంతో బుదవారం పూర్వ విద్యార్థి అలేఖ్యను పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజి పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. మిగతా విద్యార్థులు యువత కూడా సైన్స్ రంగంలో నిలిచేందుకు పేద విద్యార్థి అలేఖ్యను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన ధర్మసాగర్ సర్పంచ్

**సిరికొండ, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండలం ధర్మసాగర్ గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన జాదవ్ దినేష్, వార్డు సభ్యులు స్థానిక తహసీల్దార్ తుకారాంను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాదవ్ దినేష్ మాట్లాడుతూ ధర్మసాగర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నూతన పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌ను సన్మానిస్తున్న ధర్మసాగర్ సర్పంచ్ జాదవ్ దినేష్

# మీ డబ్బు - మీ హక్కుపై అవగాహన

**ఆదిలాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వివిధ కారణాల వల్ల పది సంవత్సరాలుగా లావాదేవీలు జరగని ఖాతాల్లోని సొమ్మును ఖాతాదారులు లేదా వారి వారసులకు అందించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో "మీ డబ్బు – మీ హక్కు" అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్బీఐ సూచనల మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ పై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో సుమారు రూ.29 కోట్ల విలువైన డిపాజిట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కొందరు ఖాతాదారులు/వారసులు క్లెయిమ్ చేయగా, బ్యాంకుల వారీగా నగదును ఎమ్మెల్యే పాయల శంకర్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఖాతాలు తెరిచి పది సంవత్సరాల పాటు ఎలాంటి లావాదేవీలు లేని ఖాతాలను బ్యాంక్ అధికారులు గుర్తించారన్నారు. ప్రజల సొమ్ము ప్రజలకే చేరేలా ఆర్బీఐ ఉద్గామ్ యాప్ ద్వారా సులభమైన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సరైన అవగాహన లేక



నామినీలు తెలియక ఖాతాల్లో డబ్బు అలాగే ఉండిపోయిందని చెప్పారు. ఉద్గామ్ యాప్ ద్వారా వివరాలు తెలుసుకుని, సంబంధిత బ్యాంకులను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే నగదును పొందవచ్చని సూచించారు. ఈ విషయంపై బ్యాంక్ సిబ్బంది, అధికారులు, మహిళా సంఘాలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ, ఫైనాన్షియల్ రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్బీఐ మార్గదర్శకాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పది సంవత్సరాలుగా లావాదేవీలు లేని ఖాతాలను గుర్తించి, అందులోని డబ్బును ఖాతాదారుల వారసులకు అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఓ, ఎన్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. గత నెల రోజులుగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజలు ఉద్గామ్ యాప్ ద్వారా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పాల్ కుమార్ దాస్, ఆర్బీఐ రాష్ట్ర అధికారి దామోదర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఓ, జడ్పీ సీఈఓ రవీందర్ రాథోడ్, డీఎంహెచ్ నరేందర్ రాథోడ్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## శబరిమలకు బయలుదేరిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

**అసిఫాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పట్టణంలో ఎమ్మెల్వే కోవలక్ష్మి మ్రతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలు దేరారు. 41 రోజుల దీక్ష అనంతరం బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక అయ్యప్ప ఆలయంలో రెబ్బెనకు చెందిన గురుస్వామి సూర్యబాస్కర శర్మ, ఆలయ అర్చకుడు నగేశ్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్ష స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం శబరిమలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సోనేరావు, తోట రాజబాబు, భట్టుపెల్లి సంతోష్, వెంకట్ గౌడ్, చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకులు సరస్వతి, జాజరి రవిందర్, గంధం శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టాల నివారణ మందు వేస్తున్న సర్బంచ్ సంగీత

## నట్టాల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలి


**ఆసిఫాబాద్, డిసెంబర్ 24,ప్రభాతవార్త:**

గొర్రెలు, మేకల పెంపకం దారులు విధిగా నట్టల నివారణ మందులు వేయించాలని పశువైద్యాదివారి మురళీకృష్ణ అన్నారు. బుదవారం ఆసిఫాబాద్ మండలంలోని బూరుగుడ గ్రామంలో నట్టాల నివారణ మందుల పంపణి కార్యక్రమాన్ని సర్పంచ్ సంగీత, పశువైద్యాధికారిలు కలిసి ప్రారంంచారు. ఈ సందర్భంగా 1400 జీవాలకు నట్టాల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మోతిరాం ప్రశాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

**తాండూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైనాయి. క్రిస్మస్ వేడుకల కోసం చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శాంటా క్లాజ్‌లు, క్రిస్మస్ ట్రీ అలంకరణలతో చర్చిలు ఆకట్టుకుంటున్నాయి. ప్రార్థనకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి

## బాలలలో నైతిక విలువలను పెంపొందించాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**



బాలలలో సత్యం, ధర్మంపట్ల నిబద్ధత, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తెలిపారు. బుధవారం జిల్లాలోని కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల, బెండర డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలపై అవగాహన కల్పించడం జరిగిందని, ధర్మం కోసం ప్రాణాలు అర్పించిన వీర బాలల త్యాగాన్ని గుర్తు చేసి, వారి విలువలను సమాజానికి తెలియజేయడం వీర్ బాల్ దివస్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో నిర్వహించనున్న వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బంద్ సంపూర్ణం

## రైతులకు మద్దతుగా వ్యాపార సంస్థలు





**బజార్‌హత్నూర్, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బుధవారం రైతులు తల పెట్టిన అఖిలపక్ష బందుకు సంపూర్ణ మద్దతు లభించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరికి నిరసనగా మండల రైతు అఖిల పక్షం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యలయం ముందు నిరసన వ్యక్తం చేసారు. స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రంగు మారిన సోయాబీన్, మొక్కజోన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని, ప్రతి రైతుకు మునుపటిలా యూరియా బస్తాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా దాదాపు ఒక్క నెల నుంచి ఇచ్చోడ, భోథ్ మార్కెట్లలో రంగు మారిన సోయాబీన్, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలేదని రైతులు అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో రైతులు అబాసుపాలవుతున్నారని. దీనికి కారణం యూరియా ఎప్పటిలాగే పంపిణీ చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం, కొత్తగా యాప్ తీసుకురావడం, దానివల్ల నిరక్షరాస్యులైన రైతులకు, ఆదివాసి గిరిజన రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, దానిని వెంటనే రద్దుచేసి యధావిధిగా యూరియా పంపిణీ చేయాలన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ఎన్నడు కూడా రైతులు సొసైటీలు, ఫర్టిలెజర్ల ముందు లైన్లో నిలుచుని ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బంది పడ్డ దాఖలాలు లేవు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు కష్టాలు మొదలయ్యాయని, ఇప్పటికైనా మొండి వైఖరి వీడనాడి రైతులకు సకాలంలో ఎరువులు, రంగు మారిన పంటను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ బంధుకు సహకరించిన బజార్‌హత్నూర్ వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు, బిఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ సాయన్న, రైతులు రాజన్న, వినీల్, గంగయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టులకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మద్దతు

**నిర్మల్‌రూరల్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ రెండో రోజు కొనసాగుతున్న జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జర్నలిస్టులు సమాజానికి అద్దంలాంటివారని, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో వారి పాత్ర కీలకమని ఫోరం నాయకులు పేర్కొన్నారు. జీవోలు ఉన్నప్పటికీ అమలు జరగకపోవడం బాధాకరమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు కొనసాగుతుందని తెలిపారు.

## పిఎస్ హెచ్ఎంల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**నిర్మల్‌రూరల్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి సంఘ సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా దస్తురాబాద్‌కు చెందిన కోట వేణు, జిల్లా అధ్యక్షులుగా ఖానాపూర్‌కు చెందిన కే ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముధోల్‌కు చెందిన ఎస్ దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మణచాందకు చెందిన ఎం భూమన్న, మహిళా ఉపాధ్యక్షులుగా సోనుకు చెందిన పి త్రివేణి, కార్యదర్శులుగా సారంగపూర్‌కు చెందిన జి భూమేష్, మహిళా కార్యదర్శిగా నిర్మల్‌రూలర్‌కు చెందిన బి జలజ, కోశాధికారిగా పెంబికి చెందిన జై లింగన్న, మీడియా ఇన్చార్జిగా సోనుకు చెందిన రమేష్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో సన్మానం చేసి అభినందనలు తెలిపారు.



మాజీ ఎంపిపి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

గుడిహత్నూర్ మండల మాజీ ఎంపీపీ జ్ఞాను కేంద్రే తండ్రి స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి స్వగ్రామం మన్నూర్ నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

పురుగుల మందు సేవించి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలం మలక్ చించోలి గ్రామానికి చెందిన మర్రి ఆడేల్లు(50) కంటి చూపు సరిగా లేక రేచీకటితో బాధపడుతున్నాడు. అతని భార్య తొమ్మిది సంవత్సరాల క్రితం చనిపోయింది. సరైన జీవనాదారం లేక కొన్ని నెలల నుండి బాధపడుతూ మనస్తాపానికి గురై, ఈ నెల 18న తన ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోగా బయట పని ముగించుకొని వచ్చిన కొడుకు, అతని బంధువులు చూసి వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. మృతుని కుమారుడు మర్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మర్రి ఆడేల్లు మృతదేహం

## తెలంగాణ రాజ్యాధికారి పార్టీ మండల కార్యవర్గం నియామకం

**తాండూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

తెలంగాణ రాజ్యాధికారి పార్టీ (టిఆర్పి) రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ కొమ్ముల ప్రవీణ్ సూచనల మేరకు తాండూర్ మండల కార్యవర్గాన్ని నియమించినట్లు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులుగా వాసాల అనిల్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భద్రపు శీధర్, ప్రధాన కార్యదర్శిగా బుద్ధార్థి స్వామీ, ఉపాధ్యక్షులుగా రాంపెల్లి చంద్రశేఖర్, కార్యదర్శిగా భానాల రాజు, సహాయ కార్యదర్శిగా ఆత్రం శంకర్, కోశాధికారిగా ఎడెలి శివ, యువజన విభాగం అధ్యక్షులుగా ఆయిల సాయి, రైతు విభాగం అధ్యక్షులుగా యండిగ జగదీశ్, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా అసలాం ఖాన్, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా చీకటి తిరుపతి గౌడ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.



అధ్యక్షుడు అనిల్ కుమర్‌ను సన్మానిస్తున్న టిఆర్పి నాయకులు

## నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేయాలి

**ఆదిలాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**



ప్రభుత్వం చేపడుతున్న ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బజార్‌హత్నూర్ మండల పశు వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ అహ్మద్ అన్నారు. అదిలాబాద్ జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బజార్‌హత్నూర్ మండలంలోని కొత్త దహెగాం సర్పంచ్‌గూడ, పాత దహెగాం గ్రామాలలో బుధవారం గొర్రెలు, మేకలకు ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దుర్వా లక్ష్మణ్, పశు వైద్య సిబ్బంది సిహెచ్ అరవింద్, మారుతీ, దుర్గజీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన

**సారంగాపూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

మండలంలోని వెస్ట్ సెక్షన్ కౌట్ల(బి) బిట్‌లోని పెండల్‌దారి అటవీ అంచు గ్రామంలో ఆదివాసీలకు అటవీ సంరక్షణ ఏ విధంగా చేపట్టాలి, వాటిపై మీ జీవన విధానం ఆధారపడి ఉంటుంది. అడవిని సంరక్షిస్తేనే ఆరోగ్యమైన జీవితం ఉంటుందని అటవీ శాఖ ఆధ్వర్యంలో అదివాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగితే ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవాలని, వన్యప్రాణుల రక్షణ చట్టాల గురించి వివరించారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెండల్‌గారికి కొత్తగా ఎన్నికైన ఎఫ్ఆర్ఓ, నిర్మల్ జీవి రామకృష్ణారావు, సారంగాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ నజీర్ ఖాన్, రషీద్, ఎఫ్ఎస్ఓ వెన్నెల, సుజాత, ఎఫ్‌బిఓలు పాల్గొన్నారు.




దుప్పట్లు అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

# మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమం ద్వారా క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందవచ్చు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త



మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమం ద్వారా బ్యాంకులు, భీమా సంస్థలు, పోస్ట్ ఆఫీసులలో ఖాతాలు కలిగి క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం చేతన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అపర్ణ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రశాంత్, ఎడిసిసి ఏజీఎం రవి కిషోర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ కిరణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతిలతో కలిసి ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తులను సమర్థవంతంగా, త్వరగా పరిష్కరించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు దాటి ఖాతాలలో నిలువ ఉండి వినియోగించని నగదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్‌లో జమ చేయడం జరుగుతుందని, ఇట్టి క్లెయిమ్ చేయని నగదుకు సంబంధించి ఎవరైనా సంబంధిత బ్యాంకులో కెవైసి డాక్యుమెంట్, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించడం ద్వారా నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు. అన్ క్లెయిమ్ నగదు సంబంధిత వివరాలను బ్యాంకుకు వెళ్లి / రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన ఉద్గం పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ఈ విషయమై గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆర్థిక అక్షరాస్యత ద్వారా వయోజనులకు అవగాహన కల్పించి విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జరుగుతుందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లలో అవాంఛిత లింకుల ద్వారా సైబర్ మోసానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఓటిపి ఎవరికీ చెప్పవద్దని, అత్యాశ, అమాయకత్వం ద్వారానే డబ్బులు నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 475 ఖాతాలకు సంబంధించి 2 కోట్ల 88 లక్షల రూపాయల క్లెయిమ్ సొమ్మును సెటిల్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లాలోని కొన్ని అన్‌క్లెయిమ్ ఖాతాల నుంచి సెటిల్ అయిన ఖాతాలకు సంబంధించిన చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లేటరల్ (ఓ అండ్ ఎం) ఎగ్జిక్యూటివ్స్‌కు సమాన అవకాశాలు కల్పించాలి

**- సీఎంఓఏఐ ఎస్టీపీపీ**

జైపూర్, డిసెంబర్ 24, ప్రభాతవార్త

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆపరేషన్స్ అండ్ మైంటైనేన్సు విభాగంలో పనిచేస్తున్న లేటరల్ ఎంట్రీ ఎగ్జిక్యూటివ్స్ కు సమాన అవకాశాలు, సమ న్యాయం కల్పించే విధంగా ప్రత్యేక పాలసీని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం సి.ఎం.ఓ.ఏ.ఐ ద్వారా ఎస్టీపీపీ ఈడి సిహెచ్ చిరంజీవికి వినతి పత్రాన్ని అందజేశారు. ప్లాంట్ ఆపరేషన్స్,ఓ అండ్ ఎం, కంట్రోల్, కమర్షియల్ విభాగాల్లో తమ అనుభవం, నైపుణ్యంతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను లాభదాయకమైన యూనిట్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించామని తెలిపారు. ఈ అంశాన్ని పలు మార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా సానుకూల స్పందన రాలేదన్నారు. ఈ సందర్భంగా సిఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంటు డి. పంతులా మాట్లాడుతూ లేటరల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రతిభను గుర్తిస్తూ ఎస్టీపీపీలో సమగ్ర పవర్ ప్లాంట్ క్యాడర్ ఏర్పాటు చేసి, డీపీసీని తక్షణమే ఏర్పాటు చేయాలనీ, లేటరల్ ఎగ్జిక్యూటివ్స్ కి ఒక ప్రత్యేకమైన ప్రమోషన్ పాలసీని ఏర్పాటు చేయాలని కోరుతూ సిఎంఓఏఐ సెంట్రల్ కమిటీ అధికారులకి తెలియజేశామని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించే విధంగా సిఎంఓఏఐ సెంట్రల్ కమిటీ ద్వారా సింగరేణి సి.ఎం.డి. దృష్టికి తీసుకువేళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి జిఎం ఎం. నరసింహారావు, జిఎం(పిసిఎస్) (ఓ అండ్ ఎం) ఎం. మదన్మోహన్, డిజీఎం (సి అండ్ ఐ) శివ ప్రసాద్, డిజీఎం (వాటర్ సిస్టం) జనగామ శ్రీనివాస్, డిజీఎం (ఎన్విరాన్మెంట్) వాసుదేవ మూర్తి, డిజీఎంలు వీర బ్రహ్మం, జిష్ణుదత్తా, ఎస్ఈ (అనలైటికల్) సుబ్బారావు, సేఫ్టీ ఆఫీసర్ పులి సురేష్ పాల్గొన్నారు.



## లక్షెట్టిపేట పోలీసుల నాకాబంది

లక్షెట్టిపేట, ప్రభాతవార్త



పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో లక్షెట్టిపేట పోలీసులు నాకాబంది నిర్వహించారు. స్థానిక ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరు కూడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు చర్యలో భాగంగా తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు వాహనాల వెంట ఉంచుకోవాలని, కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. అంతేకాకుండా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని మత్తు పదార్థాలైన గంజాయి లాంటి వాటికి బానిస కాకూడదని అలాంటివి రవాణా చేసిన తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ వాహనాలు ఎవరివి ఎక్కడినుండి ఎక్కడికి వెళ్తున్నాయి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామంలో సమస్యలను పరిష్కరించాలి

**- మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ**

లక్షెట్టిపేట, డిసెంబర్ 24, ప్రభాతవార్త



గ్రామంలో సమస్యల పరిష్కారానికి నూతన సర్పంచ్లు, వార్డు సభ్యులు కృషి చేయాలని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రేమ్ సాగర్ రావు సూచించారు. లక్షెట్టిపేట మండలంలోని పాత కొమ్ముగూడెం నూతన సర్పంచ్ దుమ్మని సత్తన్న, ఉప సర్పంచ్ చొప్పదండి రవికుమార్, వార్డ్ మెంబర్లు బుధవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చింత అశోక్, సయ్యద్ హాజీ తదితరులు ఉన్నారు.



## మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

జన్నారం, డిసెంబర్ 24, ప్రభాతవార్త

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష అన్నారు. జన్నారం మండలంలోని ఇందన్ పల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వచించారు. ఈ సంధర్భంగా ఎస్సై గొల్లపల్లి అనూష మాట్లాడుతూ వాహన చోదకులు వాహనాల పేపర్లు, ఇన్సూరెన్స్ కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని, హెల్మెట్ కూడా తప్పకుండా ధరించాలని అన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై మోటార్ వాహనం చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అలాగే వాహనదారుల లైసెన్స్ సస్పెన్షన్, జరిమానా అదేవిధంగా న్యాయస్థానంలో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా మద్యం సేవించి వాహనం నడపవద్దని పోలీసు శాఖకు సహకరించాలి అని కోరారు.



## కలమడుగు సర్పంచ్ దంపతులను సన్మానించిన ఎస్ఎస్‌సి బ్యాచ్ మిత్రులు

జన్నారం, డిసెంబర్ 24, ప్రభాతవార్త

ఈనెల జరిగిన సర్పంచ్ ఎలక్షన్లలో కలమడుగు సర్పంచ్‌గా గెలుపొందిన బొంతల నాగమణి మల్లేష్ దంపతులను 1991-92 ఎస్ఎస్‌స బ్యాచ్ మిత్రులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. తన మిత్రులు ఒకరు బిఎస్ఎన్ఎల్‌లో ఏజిఎమ్ బాబూరావు, ఉపాధ్యాయులుగా కొందరు, పోలీసు శాఖలో కొందరు ఇలా చాలా మంది స్థిరపడ్డారని, కానీ నన్ను అభినందించడానికి ఇంత దూరం వచ్చినందుకు చాలా చాలా ధన్యవాదాలు అని సంతోషం వెలిబుచ్చారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని అన్నారు.

## వేమనపల్లి తహసీల్దార్‌గా ఎన్. సాయికృష్ణ

వేమనపల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త

వేమనపల్లి మండల తహసీల్దార్‌గా ఎన్. సాయికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన బి. సాయిబాబు కలెక్టరేట్‌కు బదిలీ కాగా మండల నాయబ్ తహసీల్దారుగా పనిచేస్తున్న సాయికృష్ణకు వేమనపల్లి తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బంది తహసీల్దార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సాయికృష్ణ